క్లుప్తంగా

ప్రతిభా అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

దుగ్గొండి: రజకులలోని ప్రతిభా వంతులైన విద్యార్థులకు రజక ఉద్యోగ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు ఇవ్వనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ నెల్లుట్ల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రజక కులానికి చెందిన టెన్త్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చదివి ఉండి 9.5 జీపీఏ, అంతకంటే ఎక్కువ సాధించిన వారు అర్హులన్నారు. టెన్త్ 2023 మార్కుల మెమో, కులం సర్టిఫికెట్, కలర్ పాస్‌ఫొటో, కుటుంబ సభ్యుల బయోడేటాను అవార్డు కమిటీ ఇన్‌చార్జ్ పి.సమ్మయ్య(9441454284)కు ఈ నెల 30లోగా అందించాలని పేర్కొన్నారు.

గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



నెక్కొండ : యాదవుల కులదైవమైన గంగమ్మ తల్లి వార్షికోత్సవం బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం పోచమ్మ తల్లికి, గ్రామ దేవత (బొడ్రాయి)కి బోనాలు సమర్పించి, పూజలు నిర్వహించారు. సాయంత్రం యాదవులు గంగమ్మ తల్లి విగ్రహాలకు జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నర్సంపేట బార్ సోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము రమేష్‌యాదవ్, కుల పెద్ద బొమ్మెర బోయిన రమేష్, సారగొల్ల రావుక వీరన్న, వీరభద్రం, కదారి వీరస్వామి, కొట్టం దేవేందర్, రాపాక లచ్చులు, బొమ్మెరబోయిన ముత్తయ్య, లెంకాలపెల్లి కుమార్, అశోక్, కుమారస్వామి, దిలీప్, విజేందర్, పాల్గొన్నారు.

శిఖం భూములను కాపాడాలి



నల్లబెల్లి : మండలంలోని గోవిందాపూర్ శివారు శంషాబాద్ తుమ్మల కుంట చెరువు శిఖం భూములను కాపాడాలని ఆయకట్టు రైతులు తహసీల్దార్ దూలం మంజులకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు సంపత్‌రావు, రవి మాట్లాడుతూ తుమ్మలకుంట చెరువు 30 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. కానీ ఇటీవల సింగనబోయిన రమేష్ శిఖం భూమిని ఆక్రమించుకుని సాగుచేస్తున్నాడని తెలిపారు. రమేష్‌పై చర్యలు తీసుకుని శిఖం భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆయకట్టు రైతులు రాజేందర్, స్వామి, లాలయ్య, రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నల్లరేగడి మట్టి తరలింపు

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గ్రామంలోని గోకరాజుకుంట నుంచి అక్రమంగా నల్లరేగడి మట్టిని తరలింపును సర్పంచ్ మాదారపు భాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం అర్ధరాత్రి అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా అర్ధరాత్రి ట్రాక్టర్ల ద్వారా మట్టిని ఇటుకబట్టీలకు తరలిస్తున్నారన్నారు. రాత్రి 12 గంటల తర్వాతనే తరలించడం సరికాదన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు రాగడి మట్టిని తరలిస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా తరలిస్తున్న మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోకుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజశేఖర్, దాసరి రమేష్, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖాన ప్రారంభం

పరకాల: వైద్య ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పరకాల పట్టణంలోని దళిత కాలనీలో నిర్మించిన బస్తీ దవాఖానను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బుధవారం ప్రారంభించారు. బస్తీ దవాఖానలతో ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువగా అందించే అవకాశం ఉందన్నారు. నిరుపేద రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా బస్తీ దవాఖాన ద్వారా అందుతున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత, వైస్ చైర్మన్ విజయపాల్‌రెడ్డి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, పాల్గొన్నారు.

స్కావెంజర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

పరకాల: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసిన స్కావెంజర్స్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశాడు. బుధవారం పరకాల పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ అండ

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



కార్యకర్తల కుటుంబ సభ్యులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



పెద్దమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

నర్సంపేట : ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలంలోని లెంకాలపల్లికి చెందిన ఎద్దు రవీందర్, నెక్కొండ మండలం కస్నా తండాకు చెందిన బాదావత్ మల్సూర్‌లకు బీఆర్ఎస్ ద్వారా మంజూరయ్యాయి. రూ.4లక్షల విలువైన ఒక్కొక్కరికి రూ.2లక్షల ఇన్సూరెన్స్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ముందుచూపుతో పార్టీలో సాధారణ, క్రియాశీల సభ్యత్వం తీసుకున్న సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.2లక్షల చొప్పున బీమా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నెక్కొండ మండల పార్టీ అధ్యక్షుడు, సర్పంచ్‌లు, క్లస్టర్ బాధ్యులు, పార్టీ అధ్యక్షులు, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు అండగా ప్రభుత్వం

ముదిరాజ్ కులస్తులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నర్సంపేటలో ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీపెద్దమ్మతల్లి బోనాల పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే పెద్ది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముదిరాజ్‌ల కుల సంఘం భవనం కోసం రూ.కోటి కేటాయించి నిర్మాణ పనులను కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ముదిరాజ్ కులస్తులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాదీపం అంబేడ్కర్

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే చల్లా

సంగెం: బడుగు బలహీన వర్గాలకు అంబేడ్కర్ ఆశాదీపం అని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని లోహితలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. సమాజంలో అసమానతలను తొలగించడానికి అంబేడ్కర్ భావజాలం అవసరమన్నారు. యువత అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నతమైన స్థానం పొందాలన్నారు. గ్రామంలో అందరికి స్ఫూర్తిని ఇచ్చేలా అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు పూనుకున్న కమిటీ సభ్యులను అభినందించారు. విగ్రహావిష్కరణ అనంతరం మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కళావతి, సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సారంగపాణి, విగ్రహ దాత అరూరి సౌందర్య-భిక్షపతి, యూత్ అధ్యక్షుడు ల్యాదల్ల రాజు, నాయకులు ఎల్దొండ సందీప్, ల్యాదల్ల రమణ, బొడ్డు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోనే కొనసాగుతా



ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో ప్రభాకర్‌రెడ్డి

నర్సంపేట : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో కృషి చేశానని తెలంగాణను ఏర్పాటు చేయించిన బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పెద్ది తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటున్నారన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. కాగా ఇటీవల ఉద్యమకారులకు అన్యాయం జరుగుతుందని నిరసిస్తూ అమరవీరుల స్తూపం వద్ద ప్రభాకర్‌రెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం విధితమే. కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, రైతు సమన్వయ సమితి రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు పెండెం వెంకటేశ్వర్లు, నాయకులు దండు రాజు, శంకర్, సీహెచ్.రాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్‌తో మొరాయిస్తున్న మీసేవ కేంద్రాలు

ఇబ్బందులు పడుతున్న అర్జీదారులు

నర్సంపేట రూరల్ : సర్వర్ డౌన్ కావడం, మీసేవ కేంద్రాలు పని చేయకపోవడంతో అర్జీదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న సంఘటన తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కుల సంఘాలకు రూ. లక్ష అందిస్తున్నామని, దరఖాస్తు దారులు ఈనెల 22లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో కులం, ఆదాయం సర్టిఫికెట్ మీసేవలో దరఖాస్తు చేసుకొని తహసీల్దార్ కార్యాలయంలోని మీసేవ వద్దకు రాగానే సర్వర్ డౌన్‌గా ఉందనడంతో వెనుదిరిగిపోతున్నారు. మండుటెండల్లో సైతం వస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ప్రజల దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆదాయం, కులం సర్టిఫికెట్లను అందించాలని పలువురు కోరుతున్నారు.

ఎట్టకేలకు చర్చలు సఫలం

- నేటి నుంచి హైస్కూల్ వంటలు చేస్తాం
- లిఖితపూర్వకంగా రాసిచ్చిన మహిళా సంఘాల ప్రతినిధులు



మహిళా సంఘాలతో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నర్సంపేట రూరల్ : మండలంలోని ఇటుకాలపల్లి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో మధ్యాహ్నం భోజన వంట మనుషులతో చేపట్టిన చర్చలు బుధవారం సఫలమయ్యాయి. గురువారం నుంచి హైస్కూల్‌లో వంటలు చేస్తామని మహిళా సంఘాల ప్రతినిధులు లిఖిత పూర్వకంగా రాసివ్వడంతో తెరపడిందని ప్రధానోపాధ్యాయుడు కొర్ర సారయ్య, సర్పంచ్ మండల రవీందర్ తెలిపారు. మండలంలోని ఇటుకాలపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్నం భోజనం వంట చేసే వర్కర్లకు సకాలంలో వంట బిల్లు రావడం లేదని, వంటలు వండమని చెప్పి మూడు రోజులుగా హైస్కూల్‌లో వంటలు చేయకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడిన విషయం పాఠశాలకు విధితమే. దీంతో బుధవారం మహిళా సంఘాల ప్రతినిధులతో మండల ఐకేపీ ఏపీఎం మహేందర్, సర్పంచ్ రవీందర్, ప్రధానోపాధ్యాయుడు సారయ్య ఆధ్వర్యంలో మహిళా సంఘాల ప్రతినిధులతో సుమారు రెండు గంటలపాటు చర్చలు జరిపారు. దీంతో మహిళా సంఘాల ప్రతినిధులు సానుకూలంగా స్పందించి వంటల చేస్తామని లిఖిత పూర్వకంగా రాసివ్వడంతో కథ సుఖాంతమైంది. అయితే బుధవారం విద్యార్థులకు భోజనం బయట వ్యక్తులతో తయారుచేయించి ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీ యాకుబ్, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్ మృతి



సదానందం (ఫైల్)

నల్లబెల్లి: చికిత్స పొందుతూ హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మండలంలోని లెంకాలపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. మండలంలోని లెంకాలపల్లికి చెందిన బొమ్మకంటి సదానందం(48) మహబూబాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గత పదేళ్లుగా గొంతు క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఇటీవల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు గ్రామానికి తరలివచ్చి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడికి భార్య భారతి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



యాకయ్య (ఫైల్)

ఖానాపురం : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కన్నె యాకయ్య (38) నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. ఈ క్రమంలో నిర్మాణం కోసం అప్పులు చేశాడు. ఈ విషయంలో భార్యభర్తల మధ్య కొద్ది రోజుల నుంచి తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం ఇద్దరి మధ్య తగాదా జరగడంతో మనస్తాపం చెందిన యాకయ్య పురుగుల మందు తాగి సమీపంలోని పంట పొలాల వైపు వెళ్లి కింద పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య శ్వేత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

బొలెరోను ఢీకొట్టిన కారు

రాయపర్తి: బొలెరోను వెనక నుంచి కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలకేంద్రంలో బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొబ్బరికాయల లోడుతో వస్తున్న బొలెరో వాహనం ఖమ్మం నుంచి వస్తుంది. ఈ క్రమంలో పెర్కవేడు వైపు నుంచి అదే దారిలో వస్తున్న కారు బొలెరో వాహనాన్ని ఢీ కొనడంతో కారులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌జామ్ కాకుండా క్లియర్ చేసి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

నర్సంపేట రూరల్ : భూవివాదం కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట టౌన్ సీఐ పులి రమేష్ అన్నారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని ఖానాపురం రోడ్డులోని పుసునూరు శివారులోని భూ తగాదాలో హక్కుదారులను తమ భూమిలో పనిచేస్తుండగా వారిని అడ్డుకొని ఆ భూమిని లాక్కునే ప్రయత్నం చేయడంతో వారి ఫిర్యాదు మేరకు సంగినేని జ్ఞానేశ్వర్, అతని భార్య సంగినేని మేఘనపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎవరైనా బెదిరించి వారి భూమిని ఆక్రమించాలని చూసినా, సపోర్టు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సంగెం : బాలికపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై భరత్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13) సోమవారం అర్ధరాత్రి మూత్ర విసర్జన కోసం బయటకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ వివాహితుడు (30) వెనకాల వచ్చి బాలిక నోరు మూసి పక్కకు లాక్కెళ్తుండగా బాలిక భయంతో కేకలు వేయడంతో తల్లితండ్రులు నిద్రలేచి రావడంతో ఆ వ్యక్తి పారిపోయాడు. బాలిక తండ్రి ఆలస్యంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

దుగ్గొండి : బైక్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో కుటుంబంలోని నలుగురికి తీవ్రగాయాలైన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని గిర్నిబావి సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గీసుగొండ మండలం కొమ్మాలకు చెందిన ఏపూరి శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నర్సంపేట మండలం కమ్మపల్లికి వివాహ వేడుక కోసం వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో శ్రీధర్‌రెడ్డి ద్విచక్ర వాహనానికి వరంగల్ నుంచి నర్సంపేటకు వస్తున్న మేడపల్లికి చెందిన ఓ కారు గిర్నిబావి సమీపంలో ఢీ కొట్టింది. దీంతో శ్రీధర్ రెడ్డి, ఆయన భార్య రజిత, కుమారుడు స్టాలిన్ రెడ్డి, కూతురు అమ్ములుకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వరంగల్ తరలించారు. రజిత పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సంఘటన స్థలాన్ని దుగ్గొండి ఎస్సై నవీన్ కుమార్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలి



ఖానాపురం : సామూహిక అక్షరాభాస్యం చేయిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు



వర్ధన్నపేట: విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్



దుగ్గొండిలో..



పర్వతగిరిలో..



రాయపర్తిలో..

ఖానాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు పంపుతూ వేల రూపాయలను వృథా చేసుకోవద్దన్నారు. ఇన్‌చార్జ్ ఎంఈఓ రత్నమాల, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాస ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ బాషబోయిన ఐలయ్య, హెచ్‌ఎంలు శ్రీధర్, పద్మావతి, పాల్గొన్నారు.

తొగర్రాయిలో సామూహిక అక్షరాభ్యాసం

దుగ్గొండి: మండలంలోని తొగర్రాయి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా అడ్మిషన్ పొందిన 15 మంది చిన్నారులకు ఎంఈఓ సత్యనారాయణ అక్షరాభాస్యం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కోసం పరీక్షలు రాసి గురుకుల విద్యాలయాల్లో సీట్లు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఇది సాక్ష్యంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓడేటి తిరుపతిరెడ్డి, పీజీ హెచ్‌ఎంలు దుర్గాప్రసాద్, నాగేశ్వరాచారి, హెచ్‌ఎం పద్మశ్రీ, పాల్గొన్నారు.

వర్ధన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లోకి పంపాలని అంబేడ్కర్‌నగర్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం పాఠశాలలో విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, యూనిఫాం దుస్తులు, పుస్తకాలు, కొత్తగా పౌష్టికాహారం రాగి జావ అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, పాఠశాల చైర్మన్ సుధాకర్, కార్యదర్శి సుమలత, వైస్ చైర్మన్ లలితబ్రహ్మాచారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయపర్తి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. బుధవారం మండలంలోని తిర్మలాయపల్లిలో ఎంపీపీఎస్, అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన అక్షరాభ్యాసం కార్యక్రమాల్లో ఎంపీపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు.

విద్యతోనే పెరగనున్న విలువలు

పర్వతగిరి : సమాజంలో మానవులకు విద్యతోనే విలువలు పెరుగుతాయని జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని దౌలత్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి మంచి భవిష్యత్‌ను ఎంచుకోవాలన్నారు.

రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల



చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: ఇటీవల కురిసిన వడగళ్ల వాన పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కును ములుగు ఎమ్మెల్యే సీతక్క మండల కేంద్రంలోని రైతు వేదికలో విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గంగారం మండలం 418 రైతులకు రూ.44.84లక్షలు, కొత్తగూడలో 216 మంది రైతులకు గాను రూ.26.78 లక్షలు మంజూరు అయ్యాని తెలిపారు. అనంతరం కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కొత్తగూడ, గంగారం మండలలాల్లో రైతులు వర్షాధారంగా వ్యవసాయం చేసుకుంటారని ఫారెస్ట్ చట్టాల పేరుతో వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని ములుగు ఎమ్మెల్యే సీతక్క అటవీశాఖ అధికారులను కోరారు. మండలకేంద్రంలోని రైతు వేదికలో ఫారెస్ట్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు విజయరూప్‌సింగ్, సర్పంచ్ రణధీర్, జెడ్పీటీసీ పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్, తహసీల్దార్ చందా నరేష్, ఏఓ ఉదయ్, రేంజ్ ఆఫీసర్ వజరహత్, ఎంపీడీఓ భారతి, డీటీ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మేరు కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

గూడూరు: మారుమూల గ్రామాల్లోని మేరు కులస్తులను గుర్తించి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని సంఘం జిల్లా ఎన్నికల ఇన్‌చార్జ్ సోమా కోటేశ్వర్‌రావు, కో కన్వీనర్ అడపా మల్లికార్జున్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం మండల మేరు కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేరు కులస్తుంతా ఐక్యంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మేరు కులస్తులకు సముచిత స్థానం కల్పించాలన్నారు. అనంతరం సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పాడిషెట్టి సురేష్‌మేరును, ప్రధాన కార్యదర్శిగా ధీకొండ కృష్ణ, కోశాధికారిగా సంగ రాజు, ఉపాధ్యక్షులుగా కొత్తకొండ గోవర్ధన్, రామగిరి శ్రీనివాస్, ధీకొండ నాగేశ్వర్‌రావు, ధీకొండ శ్రీనివాస్, గూడూరు వెంకన్న, కార్యదర్శులుగా శీలం రమేష్, గట్ల సుధాకర్, బొమ్మిదేని సంపత్‌కుమార్, శీలం సతీష్, పాడిషెట్టి చాణక్య, సహాయ కార్యదర్శులుగా ఉపేందర్, వెంకన్న, శ్రీనివాస్, మురళి, రాజులను ఎన్నుకున్నారు.